చదువులమ్మకు అపూర్వ కానుక

- రూ.1.15 లక్షలతో గ్రంథాలయం
- ఏర్పాటు చేసిన 1995-96 బ్యాచ్ విద్యార్థులు
- గతేడాది ఆత్మీయంగా కలసి తీర్మానం
- సహకరించిన ఎంఈఓ, హెచ్ఎంలు


పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

కరప: ఆ చదువులమ్మ నీడలో ఎన్నో విద్యాబుద్ధులు, మరెన్నో విలువలు నేర్చుకున్న విద్యార్థులు నేడు ఆ తల్లి రుణం తీర్చుకున్నారు. తమలాగే ముందు తరాల విద్యార్థులు ఎంతో పురోగతి సాధించాలన్న ఉన్నత లక్ష్యంతో ఆ పాఠశాలకు గ్రంథాలయం ఏర్పాటుచేశారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నో ఏళ్ల తరువాత కలసిన 1995–96 బ్యాచ్ విద్యార్థులు గత ఏడాది భార్యాబిడ్డలతో వచ్చి పలకరింపులు, నాటి ముచ్చట్లతో సందడిచేశారు. అనంతరం వారంతా వారి పాఠశాలకు ఎంతో అవసరమైన గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

రూ.1.15 లక్షలతో ఏర్పాటు

తాము చదువుకునే రోజుల్లో పాఠశాలలో గ్రంథాలయం లేకపోవడం, కొనుక్కుందామంటే ఆర్థిక స్థోమత సహకరించకపోవడం గుర్తించారు. ఆ పరిస్థితి నేటి తరానికి రాకూడదని వారంతా భావించారు. చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ, మంచి పుస్తకం మాత్రం కొనుక్కో అన్న సంఘ సంస్కర్త కందుకూరి స్ఫూర్తిగా తీసుకున్నారు. ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి సూచనలతో నాటి విద్యార్థులు తుమ్మలపల్లి సత్తిబాబు, తోట రామారావు తదితరులు మొత్తంగా రూ.1.15 లక్షలు సమకూర్చారు. హెచ్ఎం యు.లీలామనోహర్ ఒక గదిని ప్రత్యేకంగా కేటాయించగా గ్రంథాలయానికి అవసరమయ్యే ఫర్నిచర్, వాతావరణం ఏర్పాటు చేశారు. పాఠ్యపుస్తకాలే కాకుండా, జీకే, పురాణ, ఇతిహాసాలు, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను సేకరించి పొందుపరిచారు.


కరప హైస్కూలు

దాతల సహకారం తీసుకుంటాం

హైస్కూలులో విద్యార్థులకు, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలతో పాటు, నీతి కథలు, విజ్డమ్, విజ్ఞానాన్ని పెంపొందించే వార, మాస, దిన పత్రికలను గ్రంథాలయంలో ఉంచేందుకు కృషి చేస్తాం. అందుకు ఉపాధ్యాయులు, దాతల సహకారం తీసుకుంటాం.

– వీవీ గంగాధర్, తెలుగు ఉపాధ్యాయుడు, గ్రంథాలయం నిర్వాహకుడు


కరపలో గతేడాది కలుసుకున్న 1995-96 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు (ఫైల్)

విద్యార్థుల భవిష్యత్‌కే..



హైస్కూలు విద్యార్థులకు ప్రయోజనం చేకూరాలన్న ఉద్దేశంతో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశాం. గతేడాది గాంధీ జయంతి రోజున మా చిన్ననాటి స్నేహితులందరం కలసి ఈ నిర్ణయం తీసుకున్నాం.

– పంతాడ హరిహర నరసింహరాజు, పూర్వ విద్యార్థి

చాలా ఉపయోగం



పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు విద్యార్థులకు ఎంతో ఉపయోగం. పాఠ్యాంశాల బోధన అనంతరం గ్రంథ సమీక్ష రాయమన్నపుడు గ్రంథాలయంలోని పుస్తకాలు తమకు సహకరిస్తాయి.

– ఆచంట మల్లీశ్వరి, విద్యార్థిని, 9వ తరగతి, కరప హైస్కూలు.

విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు



లైబ్రరీ ఉండటంవల్ల ప్రతీరోజూ ఇక్కడకువచ్చి పుస్తకపఠనాన్ని అలవర్చుకుంటున్నాం. దీనివల్ల విషయ పరిజ్ఞానం, విజ్ఞానం పెంచుకోవడానికి దోహదపడుతోంది. పూర్వవిద్యార్థులు లైబ్రరీ ఏర్పాటుచేయడం అందరికీ ఆనందంగా ఉంది.

దేవిశెట్టి పూజ, 9వ తరగతి

క్లుప్తంగా

వైభవంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని భోగి గణపతిపీఠంలో ఆదివారం ఆత్మజ్ఞాన ప్రబోధకులు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు ఆధ్వర్యంలో సహస్రనామ జపయజ్ఞ పారాయణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

విశాఖ ఉక్కు కోసం 3న రాస్తారోకో

బాలాజీచెరువు: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హెడ్ పోస్టాఫీసు వద్ద రాస్తారాకో నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు తెలిపారు. కచేరిపేట సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే దిశగా ఆలోచిస్తుందని, 32 మంది ప్రాణత్యాగాలు, 62 ఎంపీల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ కానీయబోమన్నారు. ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

భానులింగేశ్వరస్వామి షాపుల లీజు వేలం ఖరారు

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడిలో ఉన్న భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఎఫ్5, ఎఫ్6 షాపుల లీజు వేలం ఖరారైంది. దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా గతం కంటే అద్దె ఎక్కువగా రావడంతో అధికారులు పాట ఖరారు చేశారు. గతంలో ఈ రెండు షాపులకు రూ.6556 అద్దె వస్తుండగా ప్రస్తుత వేలంలో రూ.8 వేలు వచ్చినట్లు ఆలయ ఈఓ ఎం.మురళీ వీరభద్రరావు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్తిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి నివాళి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతిని ఆదివారం నిర్వహించారు. సాహితీవేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా, రేలంగి బాపిరాజు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దుస్తులు దానం చేశారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని ట్రస్ట్ సేవలను అభినందించారు.

గ్రామంలో పారిశుధ్య పనులు


వలసపాకలలో బావివద్ద శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ రామారావు

కరప: గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ వాసంశెట్టి రామారావు తెలిపారు. మంచినీటి బావి వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోయి, నీళ్లు తోడుకోవడానికి ఇబ్బందికరంగా మారింది. ఆదివారం పంచాయతీ సిబ్బందితో పిచ్చిమొక్కలు తొలగించి, బావిచుట్టూ శుభ్రం చేయించారు. మంచినీటి ట్యాంక్ పూర్తిగా నిండకపోవడంతో గ్రామస్తులు బావినీటిని కూడా వినియోగిస్తున్నారని, గ్రామ సర్పంచ్ తెలిపారు. వీధులు శుభ్రం చేయించి, డ్రెయిన్లలో పూడికతీసి, దోమలనివారణకు ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న సయ్యద్ జానీ, క్రీడాకారులు

పెద్దాపురం: స్థానిక మహారాణి కళాశాలలో సూపర్ లీగ్ పేరుతో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ పోటీలను ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబురాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ 15 రోజుల పాటు ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి శివకృష్ణ, నరేష్, సతీష్, ఆలీ, వెంకటేష్, దుర్గాప్రసాద్, బాబ్జీ, సురేష్, శ్రీను, అహ్మద్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి ఐవీ రావు

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేటలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఐవీ రావు ఆదివారం ప్రారంభించారు. బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సంఘ నూతన కార్యవర్గం ఎన్నికైన తర్వాత తొలి సామాజిక సేవా కార్యక్రమంగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అయ్యగారి వెంకటేష్, జీవీ కృష్ణప్రకాష్, మైలవరపు సత్యనారాయణ, వడ్డాది మూర్తి, భగవతి మహేశ్వర్, కందాల రవి పాల్గొన్నారు.

జెడ్పీ సెంటర్‌లో..

స్థానిక జెడ్పీ సెంటర్‌లో వలంటరీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాపారవేత్త జ్యోతుల వేంకటేశ్వరరావు ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ టీవీ బాలకృష్ణ, కార్యదర్శి చార్మినార్ వర్మ పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

బాలాజీచెరువు: స్థానిక సంజయ్‌నగర్ కాలనీలో అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్, మేము సైతం మీకోసం క్లబ్‌లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాయి. కమిటీ చైర్‌పర్సన్ చప్పిడి వేంకటేశ్వరరావు దీనిని ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షులు గణేష్, సుభద్ర, సత్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ దురాగతాలను బీసీలు మర్చిపోలేదు

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త రాజబాబు



కాకినాడ: తెలుగుదేశం పాలనలో బీసీలపై ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చేసిన దురాగతాలను బీసీలు ఇప్పటికీ మర్చిపోలేదని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల బీసీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త అల్లి రాజబాబు అన్నారు. కాకినాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు తదితర నేతలు శనివారం రౌండ్ టేబుల్ సమావేశం పేరుతో చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. టీడీపీ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. వారు అధికారంలో ఉండగా నాయీ బ్రాహ్మణులను అసెంబ్లీలో అడుగుపెడితే అంతు చూస్తానని, మత్స్యకారులను తోకలు కత్తిరిస్తానని అవమానించిన సంగతి నేటికీ బీసీలు ఎవరూ మర్చిపోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులకు బీసీలు గుర్తుకు వచ్చారన్నారు. అయితే బీసీలు ఎవరూ టీడీపీ నేతలను నమ్మే పరిస్థితి లేదని గుర్తుంచుకోవాలన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

సామర్లకోట: కార్మికుల హక్కుల కోసం సాధించుకున్న మేడేను విజయవంతం చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం ఉదయం స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శన ప్రారంభం అవుతుందని సీపీఎం నాయకుడు, సీఐటీయు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి పురవీధుల గుండా కార్మికులతో ప్రదర్శన ఉంటుందని సీపీఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ తెలిపారు. రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి ఆదివారం బంగారు, వెండి పుష్పాలతో మఖ నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు.

రత్నగిరిపై భక్తులకు ఇక్కట్లు

అన్నవరం: సత్యదేవుని కల్యాణ మహోత్సవాల తొలిరోజు ఆదివారం రత్నగిరిపై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శనివారం సాయంత్రం అన్నవరంలో ఈదురుగాలులు, వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ట్రాన్స్ కో డీఈ సూర్యనారాయణ తెలిపారు. తెల్లవారుజాము నుంచి విద్యుత్ సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు. ఉదయం 5.30 గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారి ఆలయం, వ్రత మండపాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్రతమండపాల్లో మైకులు పనిచేయకపోవడంతో బ్యాటరీ మైకులతో వ్రతాలు నిర్వహించారు. వ్రతాలు ఆచరించే భక్తుల మధ్య తిరుగుతూ పురోహితులు వ్రతకథ వివరించారు. గోకులం వద్ద వాటర్ ప్లాంట్ కూడా పని చేయలేదు. దీంతో తాగునీటికి భక్తులు ఇబ్బంది పడ్డారు. దేవస్థానం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీతో భక్తులు ఊరట చెందారు. ఉదయం 11 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ విద్యుత్‌శాఖ సిబ్బందిని ఆదేశించారు.

రత్నగిరిపై ఆకట్టుకున్న కళాప్రదర్శనలు


సత్యదేవుడు, అనంతలక్ష్మీ, సత్యవతీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్న పండితులు


రత్నగిరి ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడుతున్న మహిళలు


అనివేటి మండపంలో చేసిన పుష్పాలంకరణ

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రత్నగిరిపై ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని వధూవరులను చేసే కార్యక్రమం, పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ప్రదర్శించిన కోలాటం, స్వామి, అమ్మవార్ల ఊరేగింపు, అనివేటి మండపంలో చేసిన అలంకరణ అందరినీ విశేషంగా అలరించాయి. విశ్రాంత దేవస్థానం అధికారి పోల్నాటి గోవిందరావు సత్యదేవుని వైభవంపై ప్రసంగం చేశారు. చిన్నారుల నృత్యప్రదర్శనలతో అలరించారు.

స్వగృహ ప్రాప్తిరస్తు..

- టిడ్కో ఇళ్ల అప్పగింతకు చర్యలు
- వేగవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- మే నెలలో తొలి విడత గృహ ప్రవేశాలు


పర్లోపేటలో టిడ్కో గృహాలు

కాకినాడ: నిలువ నీడ లేని పేదల సొంతింటి కల నెరవేరే సమయం ఆసన్నమైంది.. టీడీపీ చేసిన తప్పులను సరిచేస్తూ టిడ్కో గృహాలను అర్హులకు అప్పగించే బాధ్యతను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భుజాన వేసుకుంది.. ఇళ్ల అప్పగింతకు అంతా రెడీ అయ్యింది. రాబోయే తరాలు చెప్పుకునే సంక్షేమ సంతకంలా నిలవబోతోంది.. గత టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లను నిర్మించి ఇస్తామని ఆశ చూపించి లేని ఇళ్లకు సొమ్ములు కట్టించి రూ.లక్షల ముడుపులు దిగమింగింది. ఆనక అధికారాన్ని సైతం పోగొట్టుకుంది. అప్పుడు జరిగిన తప్పులను సరిచేస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి న్యాయం చేస్తూ.. టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ.. వీరికి బ్యాంకుల నుంచి రుణ ప్రక్రియను వేగవంతం చేసి ఇప్పుడు టిడ్కో లబ్ధిదారులను సొంతగూటికి చేర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూనుకుంది. కాకినాడ పర్లోపేటలో 2,056 టిడ్కో గృహాలను నిర్మిస్తున్నారు. ఇందులో తొలి విడత 1,152 మందికి మే నెలలో ఇళ్లను అప్పగించే ప్రక్రియ ప్రారంభించారు. మొత్తం రూ.7.65 లక్షల ఖర్చయ్యే టిడ్కో ఇళ్లకు సంబంధించి రూ.2 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం, రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుండగా రూ.50 వేలు లబ్ధిదారుని వాటాగా భరించాల్సి ఉంటుంది. మరో రూ.3.65 లక్షలు బ్యాంకు రుణంగా అందిస్తున్నారు. ఈ మేరకు మొదటి విడత అప్పగించనున్న 1,152 ఇళ్లకు సంబంధించి దాదాపు ప్రక్రియ పూర్తి చేశారు. ఆ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో సహా అవసరమైన సకల సదుపాయాలు కల్పించారు. మొదటి విడత ఇళ్లు అప్పగించాక కొద్ది రోజుల్లోనే రెండో విడత కూడా ఇచ్చేందుకు చర్యలు వేగవంతం చేశారు.

780 రిజిస్ట్రేషన్లు పూర్తి

టిడ్కో ఇళ్ల అప్పగింతను వేగవంతం చేసే క్రమంలో లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. గడిచిన వారం రోజులుగా రోజుకి 100 రిజిస్ట్రేషన్లు లక్ష్యంగా పెట్టుకుని కాకినాడ, సర్పవరం రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. శనివారం నాటికి సుమారు 780 మందికి రిజిస్ట్రేషన్లను పూర్తి చేశారు. వెంటనే బ్యాంకులో మార్ట్‌గేజ్ ప్రక్రియ కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు చెప్పారు.

అతి త్వరలోనే అప్పగిస్తాం..



టిడ్కో ఇళ్లను త్వరలోనే అప్పగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మౌలిక సదుపాయాల కల్పన కూడా మరింత వేగవంతం చేశాం. నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశాల మేరకు సంబంధిత శాఖలను సమన్వయం చేసి తొలివిడత అతి త్వరలోనే ఇళ్లు పూర్తి స్థాయిలో అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– సీహెచ్ నాగనరసింహారావు, అదనపు కమిషనర్, కాకినాడ

నేటి నుంచి బాస్కెట్‌బాల్ శిక్షణ

కొత్తపల్లి: పిఠాపురంలోని రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్లో సోమవారం బాలబాలికలకు ఉచిత వేసవి బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించనున్నట్టు బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, క్రీడా దుస్తులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 93989 47669, 93474 64359 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రూ.1.49 కోట్ల పన్ను వసూలు

ఐదు శాతం రాయితీని వినియోగించుకున్న ప్రజలు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ప్రభుత్వం ప్రకటించిన ఐదు శాతం రాయితీని సక్రమంగా వినియోగించుకున్నారని మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నెలలో 2,298 మంది ఇంటి పన్నులుగా రూ.1,31,44,906, ఖాళీ స్థలం పన్నులుగా 282 మంది రూ.6,18,420, వాటర్ టాక్సుగా 1,106 మంది రూ.11,64,536 చెల్లించారని తెలిపారు. దాంతో రూ.1,49,27,862 ఆదాయం వచ్చిందన్నారు. ఈ మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు పూడి రవిబాబు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆసుపత్రిలో భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆదేశించారు. దేవస్థానం ఆసుపత్రిలో సంకల్పం, చేయూత, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలు ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వైద్యశాల లోపలకు వేడి రాకుండా పైభాగంలో షెడ్డు నిర్మించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఫార్మసీ రూమ్‌లో మందులు పాడవకుండా ఏసీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి, ఫార్మసీ సూపర్‌వైజర్, ఇతర సిబ్బంది 24 గంటలూ భక్తులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. దేవస్థానం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసీ సూపర్‌వైజర్ వి.మాధవి, దేవస్థానం ఈఈ నూకరత్నం, డీఈ రతన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మదర్‌థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు ఆదివారం రాత్రి తెలిపారు. ఈ శిబిరంలో కంటి, ఎముకలు, గుండె వ్యాధులకు సంబంధించి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. అదే విధంగా ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, శిబిరంలో యువత పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

సామర్లకోట: వేసవి సెలవుల్లో విద్యార్థులు బయట తిరగకుండా పుస్తక పఠనం చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం విద్యార్థులకు విజ్ఞానదాయకమైన పుస్తకాలను అందజేశారు.

రత్నలీల సేవలు మరువరానివి

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రంలో పని చేసిన పి.రత్నలీల సేవలు మరువరానివని సీనియర్ ఈఓలు డి.నాగమల్లేశ్వరరావు, కె.జగన్నాథ శ్రీనివాసులు అన్నారు. కొవ్వూరి బసివిరెడ్డి సత్రంలో 37 ఏళ్లుగా పనిచేసి పదవీ విరమణ చేసిన రత్నలీల సేవలను అభినందిస్తూ సత్కరించారు. శాశ్వత ఈఓలు లేని సమయంలో కూడా ఆమె ఒక్కరే సత్రం విధులు నిర్వహించడం విశేషమన్నారు.